

# అత్తగారూ-జపానుయాత్ర

ఆరోజే ప్రప్రథమంగా 'వైకౌంట్' విమానంలో బొంబాయినుండి మద్రాసు వచ్చాం మావారూ, నేనూ. ప్రొద్దుటే ఏడింటికి బొంబాయిలో బయల్దేరినవాళ్ళం పదింటికల్లా మద్రాసు వచ్చేశాం. ఇంటి కొస్తూనే మమ్మల్ని చూసి మా అత్తగారు ఆశ్చర్యపోయారు. తెల్లవారి ఆరు గంటలకు బొంబాయినుంచి ఫోనులో మాట్లాడిన మేము పదింటికల్లా యిల్లు చేరామంటే ఆవిడ నమ్మలేకపోయింది. ఇంకా అంతకంటేగూడా త్వరగా వచ్చే విమానాలు రాబోతున్నా యని మేం చెప్తే "నిజంగానా!" అంటూ దవడలు నొక్కుకున్నారు. ఆ తర్వాత మేం వచ్చిన ఆ కొత్త విమానం ఎట్లా వుంటుంది, ఏమిటి మొదలయిన విషయా లన్నీ ఒక్కొక్కటే అడిగి తెలుసుకున్నారు మా అత్తగారు.

"పోనీ, నేనూ ఓసారి ఆ కొత్త విమానంలో రానా ఏమిటే" అన్నారు. మా అత్తగారు, ఎంతో సరదాపడుతూ. వాళ్ళబ్బాయీ, మనవడూ ఒక్కసారి గొల్లున నవ్వారు.

"ఏమిట్రా నవ్వుతారు! ఏం నే వెళ్ళలే ననుకున్నారా విమానంలో?"

"వెళ్ళొచ్చు. మళ్ళీ దిగిరావాలిగా?" అన్నారు మావారు.

"ఏం దిగిరాక? భేషుగ్గా దిగిరావచ్చు, మీరంతా రాలా?"

"మా సంగతి వేరమ్మా, వయసువాళ్ళం. ఫర్వాలేదు. నీకు వయసయిపోయింది చూడు. విమానంలో కూర్చోగానే సరా! విమానం పైకెళ్ళేప్పుడు ఒక్కోసారి మాకే కడుపులో తిప్పుతుంది."

"ఎట్లాగూ!....కడుపులో తిప్పుతుందీ! నే నప్పుడే అనుకున్నా. మరి తిప్పకేంజేస్తుందీ, గరుడ పక్షిలాగా అంతెత్తున ఎగుర్తూంటే!"

"అది గరుడపక్షికంటే చాలా ఎత్తులో వెళ్లుతుందమ్మా. యీ రోజు మేం వచ్చిన విమానం పద్దెనిమిదివేల అడుగుల పైన వచ్చింది. యింకా ఎత్తుకెళ్ళే పెద్ద విమానా లున్నాయి." అని మావారు చెప్తూవుంటే మా అత్తగారు హడలిపోయారు.

"ఓయ్ నాయనోయ్, ఎట్లాగూ! అన్ని వేల అడుగులే! అంటే ఆకాశానికి దగ్గిర దగ్గి రన్నమాటా. ఇహ అంతెత్తున వెళ్ళే విమానం కిందున్న వాళ్ళ కేం కనిపిస్తుందిరా?"

"కనిపించదు, మేఘాలపైన వెడుతుంది."

"ఎట్లాగూ! మరి మన యిండ్లపైన వెళ్తున్నప్పుడు గరుడపక్షి లాగ కనిపిస్తుందేంరా?" అన్నారు. సందేహం తీరని మా అత్తగారు.

"నానమ్మ గరుడపక్షిని విడిచిపెట్టేట్టులేదు నాన్నా, 'పూర్' గరుడపక్షి'' అని మావాడు గరుడపక్షిమీద జాలిపడుతూ బొంబాయినుంచి మేం తెచ్చిన బొమ్మలు తీసుకుని మేడమీది కెళ్లాడు.

"అసలు విమానం మన యిండ్లమీద వెళ్ళే ఎత్తుకు రావడానికి, యిక్కడికి యాభై మైళ్ళ ముందునుంచీ కాస్త కాస్తగా దిగుతూ వస్తుందత్తా కిందికీ" అన్నాను.

"అస లంత పైకి వెళ్లమన్న దెవరు? కాస్త కాస్త మళ్ళీ దిగి రమ్మన్న దెవరు? మన యిండ్లమీద వెళ్ళినట్టు సాంతం ఒకే ఎత్తులో వెళ్ళ గూడదూ!" అని నన్ను దబాయించారు మా అత్తగారు.

"ఎట్లాగమ్మా, మన యిండ్లమీద వెళ్ళినంత కిందుగానే, దార్లోవచ్చే కొండలమీదకూడా వెళితే క్లోజే...." అన్నారు మావారు నవ్వుతూ.

"మరి అంతెత్తున పోతూంటే మరి కడుపులో తిప్పదుట్రా!'' అన్నారు మా అత్తగారు.

"అబ్బే! బాగా ఎత్తుకు వెళ్ళింతర్వాత ఏమీ వుండదు. కడుపులో తిప్పినా, వాంతులైనా ఎక్కేప్పుడూ, మళ్లీ దిగేప్పుడే! పైకి వెళ్ళిం

తర్వాత మనింట్లో సోఫాలో కూర్చున్న ట్లుంటుంది. విమానం వెళ్లేది కూడా మనకు తెలీదు." అని మావారు చెబుతూంటే 'ఆ' అంటూ నోరు తెరుచుకుని విన్నారు మా అత్తగారు.

"ఒరేయ్—ఏమైనాసరే—నా వూపిరుండగానే వెళ్లాల్రా విమానంలో.." అన్నారు మా అత్తగారు తెగించి.

"ఆ వుండే వూపిరి విమానంలో కూర్చోగానే పోకుండా వుండాలిగా" అన్నారు మావారు నవ్వుతూ....

"పోతే పోనీరా, పీడా బాయిరి" అన్నారు మా అత్తగారు కూడా నవ్వుతూ....

"పోనీ, ఒకపని చెయ్యం డత్తా. రేపు మీ అబ్బాయి జపాను వెళ్ళే ముందు ఢిల్లీ వెళ్తున్నారుగా! మీరు కూడా ఆయనవెంట వెళ్ళిరండి విమానంలో." అన్నాను.

"ఏంరా! నాకు చెప్పలేదేం! అయితే జపాను వెళ్లాలంటే ఢిల్లీవెళ్ళే వెళ్లాలా!" అన్నారు మా అత్తగారు.

"అవునమ్మా" అన్నారు మావారు, ఏదో ఆలోచిస్తూ.

"ఢిల్లీ వెళ్లినప్పుడు దగ్గిరే గనక ఆగ్రానుంచి చలవరాతి బొమ్మలు పట్టుకురండి." అన్నాను మావారితో.

"ఆ బొమ్మ లంతా కొంటూ కూర్చుంటే నేను జపా నెప్పుడెళ్ళేది? 'సిలోన్' మీదుగా జపాన్ వెళ్లాలంటే ఆవలెల్లుండికల్లా 'సిలోన్' లో వుండాలి నేను. 'సింగపూర్' వెళ్లి వెళ్ళేట్లయితే శుక్రవారందాకా టైమ్ వుంది నాకు."

"మరి ఎప్పుడ్రా ప్రయాణం?" అన్నారు మా అత్తగారు...

"రేపే నమ్మా" అన్నారు మావారు పరధ్యానంగా, ఏదో ఆలోచిస్తూ.

"రేపే! మరి నన్ను కూడా నీతోబాటు తీసుకెళ్ళరా, ఈ రోజు మీ రొచ్చిన కొత్త 'అక్కొంటు' విమానంలో" అన్నారు మా అత్తగారు.

మావారు గొల్లున నవ్వుతూ...."అక్కౌంట్ విమానం గాదమ్మా, ప్రైకౌంట్ విమానం." అన్నారు. మా అత్తగారు తెల్లబోయారు, పాపం!

"ఆఁ, ఏదోలేరా, ఎత్తుభారం విమానం. ముసల్దానికి నాకేం తెలుసా పేర్లన్నీ! ఏనాడు విన్నాను? అది సరేకానీ మరి విమానంలో వెళ్ళేప్పుడు మనవెంట సామాన్లూ గట్రా తీసుకెళ్లొచ్చా?" అన్నారు మా అత్తగారు.

"తీసుకెళ్ళొచ్చు...కాని రైల్లో తీసుకెళ్ళేనన్ని సామాన్లు తీసుకెళ్ళ నివ్వరు" అన్నారు మావారు.

"అబ్బే, రైల్లో తీసికెళ్లినన్ని సామాను లెందుకురా! మట్టసంగానే తెస్తాన్లే. నా మడిబట్టలూ, ఇనపకుంపటీ, కాసిని బొగ్గులు, చారెడు బియ్యం పొంగించుకొనే కాళహస్తి చిన్న కంచు పప్పుగిన్నె, చారుబెట్టే చిన్న సత్తుగిన్నె, కూరముక్కలు వేపుకునే చిట్టిబాండీ, రెండు గరిటెలూ, నా మరచెంబూ, మడినీళ్ళ బిందె తప్ప. ఊరగాయ జాడీ లన్నీ యిక్కడే పడేస్తాలే, అన్నీ కలిపి ఓ చిన్న గోతాం సామాన్లు. అంతే" అని మా అత్తగారు చెబుతూంటే మావారు పొట్ట చెక్కలయ్యేట్లు నవ్వుతూ,

"సరేలేమ్మా, అట్లాగేలే" అంటూ మేడమీది కెళ్లి పోయారు.

బొంబాయినుంచి తెచ్చిన చీరలూ బొమ్మలూ వగైరా రెండు పెట్టెల సామాన్లూ మా అత్తగారికి చూపించాను. అన్నీ చూసిన మా అత్తగారు "అది సరేనే. విమానంలో యిన్ని సామాన్లు తెచ్చారే మరి నా వంట సామాను పట్టదటే!" అన్నారు.

"పట్టకేం, అంత పెద్ద విమానంలో?" అన్నాను.

"ఆ, అదేగదా! అబ్బాయి కంతా ఎగతాళే...వాడిమాటలకేం గానీ, తెలీకడుగుతా. నా వయసువా ళ్ళెవరూ విమానంలో వెళ్ళరా ఏం!" అని అడిగారు మా అత్తగారు నన్ను రహస్యంగా.

"ఎందుకెళ్ళరూ! చక్కగా వెళ్తారు."

"మరి వాడేదో రేపు జపాను వెళ్తాడంటున్నావుగా! నువ్వుకూడా వాడివెంట వెళ్ళగూడదూ!" అన్నారు మా అత్తగారు.

"ఎట్లా వెళ్ళేదీ అబ్బాయిని ఒదిలిపెట్టి! రేపు పరీక్ష లొస్తున్నాయే వాడికి" అన్నాను దిగులుగా, మావారివెంట వెళ్ళలేకపోతున్నందుకు మనసు లోనే బాధపడుతూ.

"ఆ, ఈ సంవత్సరం పరీక్ష కెళ్ళకపోతే పై సంవత్సరం వెళ్తాడు లెద్దూ. ఇంత పసితనంలోనే పెద్దచదువులు చదివి వాడేం చేయాలీంట" అన్నారు మా అత్తగారు, మనఃవణ్ణి వెనకేసుకొస్తూ.

"ఆ మాట మీ అబ్బాయి ఎదటనకండి, పూర్వకాలంవాళ్లు పిల్ల ల్ని టాగే చెడగొడతారంటూ ఉపన్యాసం మొదలెడతారు." అన్నాను.

"ఆ, వాడిముఖంలెస్తూ. వాడికేం తెలుసు—ఒంటరిగా జపాను వెళితే వాడి తిండీ తిప్పలూ చూసేవా ళ్ళెవరుంటా రక్కడ? ఎంతయినా పెళ్ళాం పక్కన వెళ్లిన ట్లుంటుందా!" అన్నారు మా అత్తగారు. నాకు నవ్వొచ్చింది.

"జపాన్‌లో చాలామంది ఆడవాళ్ళు వుంటారట, ఇక్కణ్ణుంచి వెళ్ళే వా ళ్ళందరి సౌకర్యాలూ వాళ్ళే చూస్తారట" అన్నాను.

"ఎట్టాగూ!" అంటూ మా అత్తగారు కీచుకీచుమంటూ నవ్వారు. "ఏమేవ్...జాగ్రతేవ్" అన్నారు నవ్వుతూనే.

"అబ్బే, మీ అబ్బాయిని ఎక్కడికైనా నమ్మకంగా పంపించవచ్చు లెండి. అక్కడి ఆడవాళ్ళు ఎవరూ నాలాగా పొరపాటు పడరు. తీరా అక్కడికి వెళ్ళంతర్వాత మీ అబ్బాయి గుణమే మారకుండా వుండాలి." అన్నాను నవ్వుతూ.

"ఛీ, నోర్ముయ్! వా డట్టాంటి వాడు గాడు. బంగారుతండ్రి! ఇంతకూ అక్కడి ఆడవాళ్ళు మంచివాళ్ళయి వుండాలిగాని."

"మంచివాళ్ళే అంటున్నారు. మనదేశంలోలాగే సంసారస్త్రీ లంతా భర్త ఏమన్నా అణిగీ, మణిగీ వుంటారట. ఇంగ్లీషువాళ్ళలాగా అదేమంటే విడాకు లిచ్చుకోరట."

"అట్లాగా! అయితే అంతా మనవూర్లాగే నన్నమాట. చూడాల్సిన వూరే! పోనీ నువ్వు వెళ్లకపోతే నన్నన్నా పంపవే జపానుకూ, అబ్బాయితోకూడా వెళ్లి చూసొస్తాను" అన్నారు.

"మీరా!" అన్నాను. నా గొంతులో ఏదో అడ్డు పడ్డ ట్లయింది....

"ఏమే, నేను జపాను వెళ్ళగూడదా!"

"అబ్బే, వెళ్ళగూడ దని ఎవ రన్నారు? వెళ్ళచ్చు. కాని, ఒక్కటే చిక్కు. మీరు వెళ్ళేట్లయితే కొన్ని నెల్లముందే 'పాస్‌పోర్టు' కు 'అప్లయి' చేసివుండాలి. దానికి చాలా గొడవుంది. ఎప్పు డంటే అప్పుడు, మన యిష్టం వచ్చినట్లు వెళ్ళడానికిలేదు. దూరాభారం," అన్నాను.

"అదేమిటే, దూరాభారం అంటావూ! అదేం ఇంగ్లాండు గనకనా!.. ఢిల్లీ దగ్గిరే ఆగ్రా వుందనీ, దానిపక్కనే జపా ననీ అబ్బాయి నీతో చెప్తూంటే విన్నానుగా! అసలిన్నాళ్ళూ ఢిల్లీ పక్కనే జపానుందని నాకు తెలీదు. తిక్క మొత్తుకోళ్ళు," అంటూ పడీపడీ నవ్వారు మా అత్తగారు. నే నెట్లా నవ్వేది! ఎట్లా నవ్వకుండా వుండేది!

"ఢిల్లీ పక్కనే జపా నుందని మీ అబ్బాయి అంటుండగా విన్నారా, లేక మీరే అనుకుంటున్నారా?" అని అడిగాను.

"నే ననుకోడం ఏమిటే నా తలకాయా. రేపు వాడు ఢిల్లీ వెళ్ళే ముందో, ఢిల్లీనుంచో సిలోపూర్ వెళ్ళా లన్నాడు గదూ!"

నా మతిపోయింది. "సిలోపూర్ ఏమిటీ! సింగపూరా!" అన్నాను నవ్వాపుకుంటూ.

"ఆ, అదే అదే....ఇంకో పేరేదో చెప్పాడమ్మా" అంటూ తల గోక్కున్నారు మా అత్తగారు.

"సిలోనా?" అన్నాను నేనే మళ్ళీ.

"ఆ ఆ...సిలోనా—సిలోనా..."

"'సిలోనా' గాదు....సిలోన్" అన్నాను.

"ఆ, ఏదోలే, మరి ఆ ఊళ్ళన్నీ చూడాలంటేకూడా 'ప్యాస్ కోర్టు' కావాలంటే!" అన్నారు మా అత్తగారు. నవ్వాపుకోలేక చచ్చాను.

"ఆఁ, కావాలి" అన్నాను.

"అయితే మరెట్టాగే. ఎట్టాగోట్లా రేపు వాడితోకూడా నన్ను జపాను పంపించే ఏర్పాటు చేయవే" అన్నారు నా చేతులు పట్టుకుని మా అత్తగారు. పాపం అనిపించింది.

"ఒకళ్ళు పంపించడాని కేముంది! మీరు అడగండి మీ అబ్బాయిని" అన్నాను.

"అబ్బే! నా మాట వాడి కోలక్ష్యమా! ప్చ్" అన్నారు మా అత్తగారు.

"మరి నామాటా అంతేగా!" అన్నాను.

"అదెట్టాగే! నీ పిచ్చి గానీ. ఈ కాలంలో తల్లిమాట ఎవరే ఖాతరు చేస్తారు? నువ్వు కాస్త గట్టిగా చెప్పకపోతే నేను జపాను వెళ్తా ననడం వాడింకా ఎగతాళిగానే అనుకుంటున్నాడు." అన్నారు మా అత్తగారు. ఏం చెప్పేది?

ఈ లోపుగా మావారే మళ్ళీ మేడ దిగొచ్చారు. ఆయన్ని చూడగానే నాకు నవ్వాగిందికాదు. అబ్బాయొచ్చాడు అడగమన్నట్లు మా అత్తగారు నాకు సౌంజ్ఞ చేస్తూ, నా చేతిమీద పొడిచింది.

"ఏమండీ! ఢిల్లీదగ్గిరున్న జపానుకట, మీ అమ్మగార్ని తీసుకెళ్తారా!" అన్నాను.

"ఢిల్లీ దగ్గిరుండే జపా నేమిటి!" అన్నారు మావారు.

"అదేరా యిందాకా నువ్వన్నా!....ఢిల్లీ వెళ్లి ఏకంగా ఆగ్రామీదుగా జపా నెడతానపీ," అని మా అత్తగా రంటూంటే మావారు నవ్వుతూ, వాళ్ళమ్మను కాసేపు ఏడిపించడానికి, "ఆ....అవునవును, అన్నాను." అన్నారు మావారు.

"మరింకేం! తిక్కముండనిజేసి మరీ ఏడిపిస్తావేమిటే" అంటూ నా బుగ్గపొడిచింది మా అత్తగారు....నా అవస్థ చూసి మావారు నవ్వారు.

"మీరేదో 'సిలోపూర్' వెడతారట!" అన్నాను కోతిలాగా వూరుకోకుండా.

"సిలోపూరేమిటీ; సింగపూరు."

"అదేలెండి. మరి సిలోన్ మాటేమిటి? అందుకే రెండూ కలిపి 'సిలోపూర్' అన్నారు మీ అమ్మగారు 'షార్టుకట్'లో" అన్నాను. మావారు నవ్వలేక ఆయాసపడిపోయారు.

"అబ్బ! చాలు. చంపకండి. అసలు జపాను ఎటెళ్ళాలో ముందు నేనే మర్చిపోయా నిప్పుడు" అన్నారు మావారు.

"అదేమిట్రా! అట్టా మర్చిపోతే ఎట్టాగూ? అవూ రెటెళ్లాలో బాగా తెలిసినవాళ్ళను అడిగి, జాగ్రతగా కనుక్కోరా. ఫలానాచోట దిగుతానని ముందుగానే విమానంతోలే డ్రైవర్‌తో చెప్పివెడితేసరి. ఆ వూరొచ్చేసరికి చచ్చినట్టు విమానం కిందికి దింపుకొస్తాడు" అని మా అత్తగారు చెపుతూంటే మావారు మళ్ళీ కడుపుబ్బ నవ్వారు.

"ఏమిట్రా తిక్కన్నా, అంతచేటు నవ్వుతున్నావ్! అది సరేగానీ జపా నిక్కడి కెంతదూరంరా?" అన్నారు మా అత్తగారు.

"అబ్బే. దగ్గిరేనమ్మా—ఢిల్లీ పక్కనేగా" అన్నారు నన్ను చూసి నవ్వుతూ.

"మరి టిక్కెట్టెంతరా జపానుకూ?"

"నలభై రూపాయలా నాలుగు పైసలు."

"నలభై రూపాయలే! అవున్లే మరి-ఢిల్లీదగ్గరాయె. మాటలా! పైగా విమానం తోలేవాళ్లు విపరీతంగా టిక్కెట్టు ధర పెంచేసుంటారు, రైలు కంటే ఎక్కువ కావాలంటూ. కాస్త డబ్బున్నవాళ్ళని తెలిస్తే టిక్కెట్టు ధర మరి కాస్త ఎక్కువ జేస్తారేమోగూడా....అది సరేగానీ, నేను జపాను రావాలంటే అదేదో 'ప్యాసు' కావాలంటే! ఏమిట్రా అది" అన్నారు మా అత్తగారు.

"అదా—గేటుప్యాసు—" అన్నారు మా వారు నవ్వుతూ.

"మరి ఆ 'ప్యాసు' లేకుండా రానివ్వరా? ముసల్దాన్నేగా. నాక్కూడా ఎందుకురా ప్యాసూ పూసూనూ! నువ్వు చెప్తే వింటార్లేరా. ఎట్లాగోట్ల నన్ను కూడా జపాన్ తీసికెళ్ళరా. చూస్తాను!"

"నువ్వెందుకమ్మా జపానూ!—" అన్నారు మావారు నవ్వుతూ.

"చూట్టానికిరా! ఏం, ఆడవాళ్లు రాగూడదా ఏం?"

"రాగూడదు—అసలక్కడే ఆడవాళ్లెక్కువయి చస్తున్నారు—ఇంకా యిక్కణ్ణుంచి గూడా ఎందుకూ?" అన్నారు మావారు.

"పోన్లేరా. ఆడవాళ్లెక్కువుండేవూరే కళకళలాడుతూంటుంది. ఆడదిలేని యిల్లెటాగో ఆడవాళ్లులేని దేశంగూడా అంతే. ఏమో నాయనా, చూద్దామనుకున్నాను—ఎటూ నీ పెళ్లాంగూడా రావడంలేదు గనక, తల్లిని నన్నయినా తీసుకెళ్తే, కాస్త వేళకు నీ తిండీ తిప్పలూ చూసిందాన్నవు తాను; అట్టాగే నేనూ జపాను చూసొచ్చినట్టవుతుంది" అని మా అత్తగారు అంటూంటే మా వారు యింక నవ్వలేక కుర్చీలో చేరబడ్డారు.

"యింతకూ జపానుకు రైల్లో వెళ్ళాలా! విమానంలోనే వెళ్ళొచ్చా?" అన్నారు మా అత్తగారు.

"నీ యిష్టం అమ్మా—ఎందులోనైనా వెళ్ళొచ్చు."

"రైల్లో ఎందుకురా. ఎన్నోసార్లు వెళ్లానుగా!—విమానంలోనే ఒక సారి జపాను తీసికెళ్ళరా—" అన్నారు మా అత్తగారు సంబరపడిపోతూ.

"సరే. అట్లాగేలేమ్మా—రేపు ఢిల్లీ వెళ్ళి తిరిగి యింటికి రావాల్సిన పనుంది—మళ్లీ వెళ్ళేప్పుడు నిన్ను తీసుకెళ్తాలే—యీ లోపుగా నీ వంట సామా నంతా గోతానికి వేసుంచు" అన్నారు మా వారు భోజనానికి లేస్తూ.

"ఆ—అదెంత వంట సామాన్రా—గోతాంలోవేసి కట్టడం క్షణం పని. యింతకూ మరి కోడల్నీ, అబ్బాయినీ ఎప్పుడు తీసుకెళ్తావురా జపానుకూ?" అన్నారు మా అత్తగారు మమ్మల్ని రికమెండ్ చేస్తూ....

"ఇదుగో....రేపు నువ్వు జపాను వెళ్ళి వస్తూనే వాళ్ళిద్దర్నీ తీసు కెళ్తాను...దగ్గిరేగా!"

"ఆ....అదే మరి...ఆపాటికి పిల్లవాడి పరీక్షలుకూడా అయిపోతా యిలే—మరి నువ్వుగూడా లేవ్వే భోజనానికీ..." అన్నారు మా అత్తగారు, లేస్తూ.

"అబ్బాయి భోంచేశాడా?" అన్నాను.

"ఆహా. వాడూ, నేనూ మీరొచ్చేముందే భోంచేశాం....యింతసేపా! మీరే పెందరాళ ఓముద్ద తినండి...." అంటూ వంటింటివేపు వెళ్లారు మా అత్తగారు. ఆమె అట్లా లోపలికి వెళుతూనే—

"యిదేమిటే, మా అమ్మకు జపాను వెళ్లాలనే పిచ్చి పట్టుకుంది!...." అన్నారు మా వారు నవ్వుతూ.

"అవునండీ పాపం....ముఖ్యంగా విమానంలో ప్రయాణం చెయ్యా లని ఆమె చాలాకాలంగా కలవరిస్తోందండీ....పోనీ, మీరు వెళ్ళేటప్పుడు తీసుకెళ్ళగూడదూ!..." అన్నాను చీవాట్లు తింటా నని తెలిసీ.

"నీకేం మతీ, గతీ పోలేదుకదా! అన్నీ తెలిసివుండి నువ్వుకూడా మా అమ్మలాగా అడుగుతున్నావేమిటి" అన్నారు మా వారు నామీద కోప్పడుతూ.

"మరి, పాపం. ఆమెను తీసుకెళ్తానంటూ అబద్ధా లెందుకు చెప్పారు? నిజంగానే జపాను మన యింటివెనకాల వుందనుకుంటోందండీ ఆవిడా."

"ఆమె అట్లా అనుకోడమే మనకు క్షేమం ...ఎందుకంటావా! జపానెక్కడుందో, ఎంతదూరంలోవుందో తెలిస్తే ముందు నన్ను వెళ్ళొద్దంటుంది....ఆమెకు తెలీనంతవరకూ మనం అదృష్టవంతులం....మనవాడు పుసిక్కన చెప్పేస్తాడేమో కాస్త చూడు....నేను వెళ్ళిందాకా జపాను ఢిల్లీ దగ్గరే అంటూండు...." అన్నారు.

"మరి అవి దొస్తానంటున్నారే మీతోగూడా?"

"రేపటికి తప్పించుకున్నాగా! అట్లాగే జపానువెళ్ళేరోజు యీలాగే ఆలోచిద్దాంలే." అని మావా రంటూండగానే భోజనానికి కేకేశారు మా అత్తగారు....ఆ రోజు అర్ధరాత్రిపూట మావారూ నేనూ ఖంగారుపడుతూ లేచాం. పక్కగదిలో మనవడి మంచం పక్కన పరుపేసుకుని పడుకున్న మా అత్తగారు గోలగోలగా కేకలేస్తూ ఏడుస్తోంది నిద్దట్లో....మాకంటే ముందే మావాడు లేచి "నానమ్మా-నానమ్మా" అంటూ తట్టి లేపుతున్నాడు... యింకా ఏడుస్తూనేవుంది...మావారు వెళ్ళి ఆపళంగా వాళ్ళమ్మను లేవదీసి కూర్చోబెట్టారు.

"అమ్మా...అమ్మా...ఏమైంది? ఎందుకట్లా కలవరించావు!" అంటూ వాళ్ళమ్మ భుజంపట్టి కుదిపారు. అప్పటిగ్గాని మా అత్తగారు యీ లోకంలోకి వచ్చిపడ్డారుకారు. ఒకసారి మా ముగ్గుర్నీ ఎగాదిగా చూసి కండ్లు నులుపుకుంటూ-'ఛీ ఛీ! వెధవకల' అన్నారు మా అత్తగారు, ముఖం తుడుచుకుంటూ.

"ఏం కలొచ్చింది నానమ్మా! రాత్రి నీకు 'టార్జాన్ కామిక్స్' చదివి వినిపించానే, అందులో 'టార్జాన్'తో పోట్లాడిన సింహం ఏమన్నా కల్లో వచ్చిందా!...." అన్నాడు మావాడు, వాడి కొచ్చిన కలలాంటి కలే వాళ్ల నానమ్మకూడా వచ్చిందేమో ననుకుంటూ.

"అబ్బే-లేదురా. పగలంతా జపాను, జపాను అంటూ మాట్లాడు కున్నాంగదూ.... నేనొక్కత్తెనూ విమానంలో కూర్చుని జపాను వెడుతున్నట్టే కల."

"ఎవరూ!....నానమ్మే ! జపానే ! వెళ్లడమే !....కంగ్రాచ్యులేషన్స్ నానమ్మా ....కంగ్రాచ్యులేషన్స్" అంటూ మా వాడు చప్పట్లుకొట్టి నవ్వుతూ వాళ్ళ నానమ్మకు షేక్ హేండ్ ఇచ్చాడు.

"నువ్వుండు నాన్నా-అది సరేనమ్మా .... విమానంలో వెళ్ళడం నీ కిష్టమేగా!....మరి కేకలేసి ఎందుకు ఏడ్చావూ?...." అన్నారు మావారు.

"అదా....నే వెళ్ళే విమానానికి ఎదురుగుండా యింకో విమానం ఒచ్చిందిరా....అదీ యిదీ ఒక్కసారిగా ఢీకొట్టడం ఏమిటి, కూర్చున్న కుర్చీతోసహా నేను బోర్లాబట్టం ఏమిటి....ఓయమ్మ! తల్చుకుంటేనే భయంగావుందిగా....అంతెత్తునుంచి, నేను కూర్చున్న విమానం రెక్కలు తెగిన జటాయువులా ఒక్కసారిగా కిందపడ్డదిరా....యిహ చచ్చిపోతున్నా ననే అనుకుని అట్లా కేకలేసి ఏడ్చారా...." అని మా అత్తగారు చెప్తుంటే మా వాడు పొట్ట చెక్కలయేట్టు నవ్వుతూ—

"నానమ్మ యింతవరకూ ఒక్క సారిగూడా ప్లే నెక్కలేదు. ఇంతలోకే 'ప్లేన్ క్రేష్'....'వాటే వండర్‌ఫుల్ డ్రీమ్' నానమ్మా..." అన్నాడు.

"మరి యింక విమానంలో ఎక్కవన్నమాటేగామ్మా?" అన్నారు మావారు, యీ దెబ్బతోనైనా వాళ్ళమ్మ విమానంలో జపానొస్తాననటం మానేస్తుందేమోనన్న ఆశతో.

"ఆఁ, సింగినాదంరా....ఏమిటో....కలలో ఒచ్చింది యిలలో జరుగుతుందా ఏమిటి!....అయినా ఎదురుగా విమానాలు రాకుండా కొస్త జాగ్రత్తగా చూసుకుని వెళ్తే సరి " అన్నారు మా అత్తగారు నిర్లక్ష్యంగా చప్పరిస్తూ... యింకేం మాట్లాడుతాం!... మా వారు తెల్లబోయి నావైపు చూశారు...నాకు నవ్వొచ్చింది.

"సరే యిహవెళ్ళి పడుకోండర్రా, ... పాపం అనవసరంగా మిమ్మల్నందర్నీ నిద్రలేపాను తిక్కముండని" అంటూ నవ్వారు మా అత్తగారు.

" 'నానమ్మా గోస్ టు జపాన్' అని ఒక పిక్చరు తీయాలి నాన్నా" అంటూ మా వాడు అల్లరి మొదలెట్టాడు.

"చాల్లే పడుకోరా తిక్కన్నా...పొద్దున్నేలేచి ప్రైవేటు మాస్టరింటికెళ్ళాల్లా వుంది" అంటూ, మంచినీళ్లు తాగడానికి లేచారు మా అత్తగారు.

అర్ధరాత్రి ఒకసారి మెలుకువొస్తే మళ్ళీ టపళంగా నిద్రపట్టడం కష్టం. అందుకు తగినట్టే మా అత్తగారి కల నన్ను హడలగొట్టింది... తెల్లవారి మావారు ఢిల్లీ ప్రయాణం పెట్టుకున్నారే అని మనసులో బిక్కుబిక్కుమంటం మొదలెట్టింది...ఆ రాత్రంతా భయంతోనూ, దిగుల్తోనూ, కంటి మీద కునుకులేకుండా చేసింది మా అత్తగారి కల.

తెల్లవారి ఢిల్లీ వెళ్ళేప్లేనుకు బయల్దేరారు మావారు. "ఎదురుగా ఒచ్చే విమానాల్ని కొస్త జాగ్రత్తగా చూసి పక్కకు తప్పుకుని వెళ్ళమని ఆ విమానం తోలే డ్రైవర్‌తో చెప్పరా..." అంటూ కొడుక్కు భద్రం చెప్పింది మా అత్తగారు.

"విమానం తోలడం ఏమిటి నానమ్మా!...అదేం జట్కా అనుకున్నావా తోల్డానికి!" అంటూ మావాడు విరగబడి నవ్వుతూంటే మా వారుకూడా నవ్వుతూ వెళ్ళి కార్లో కూర్చున్నారు.

ఢిల్లీ వెళ్ళివచ్చిన మర్నాడే జపాన్ బయల్దేరారు మావారు.."మరి

నామా శేమిత్రా!'' అన్నారు...పాత గోతానికి వంట సామానూ, మడి బట్టలూ వేసి మూతి కట్టిపెట్టి సిద్ధంగావున్న మా అత్తగారు. మా వారు చిక్కులో పడ్డా రనుకున్నాను.

"ఇదుగో నేనువెళ్ళి పంపిస్తానమ్మా విమానం...ఇప్పుడు నేను వెళ్లే విమానంలో బొత్తుగా చోటులేదని నాకు మాత్రం ఒక్కటికెక్కే టిచ్చారు" అంటూ తప్పుకున్నారు దొంగ. మాఅత్తగారు, పాపం, నిజమేనని నమ్మింది.

"మరి ఒంటరిగా ఎట్టారా విమానంలో రావడం!'' అన్నారు కాస్త దిగులుగా మా అత్తగారు.

"మొన్న రాత్రి కల్లో వెళ్లావుగదమ్మా, ఒంటరిగా, విమానంలో" అన్నారు మావారు నవ్వుతూ.

"ఛీ, ఛీ, పీడకల...అట్టా ఎందుకు జరుగుతుందిలే''...అంటూ తన కొచ్చిన పీడకల తల్చుకొని భయపడిపోయారు మా అత్తగారు.

"మరి ఎట్టారా నే రావడం!'' అన్నారు మా అత్తగారు.

"ఏముందమ్మా...ఇక్కడ విమానంలో కూర్చుంటే జపాన్‌లో దిగడమే! దగ్గిరేగా! పైగా విమానంలో చాలామంది మనుషు లుంటార్లే" అన్నారు మా వారు నావైపు చూసి నవ్వుతూ.

"అయితే ఇంకేం!" అన్నారు కొడుకు మాటలకు తృప్తిపడ్డ మా అత్తగారు.

"అయితే మరి నానమ్మను తీసుకెళ్ళడం లేదా నాన్నా'' అంటూ వచ్చాడు లోపల్నుంచి మావాడు.

"ఇదుగో నేను జపాన్లో దిగి ఆ విమానం అట్లాగే పంపించేస్తా రా నానమ్మకోసం."

"అరెరె! నానమ్మ క్వీన్ మేరీలాగా స్పెషల్ విమానంలో వెడుతుందన్నమాట.''

"వెళ్ళకేంరా!....రేపు నువ్వు పెద్దవాడి వైనాక నా కోసం 'పెషల్' విమానం కొంటావేమో ఎవరు చూశారు" అంటూ మనవడి బుగ్గలు సాగదీసి ముద్దు పెట్టుకుంది మా అత్తగారు.

"నేను పెద్దవాడిని అయిందాకా ఎందుకు నానమ్మా! యిందా-నీకోసం యిప్పుడే ఒక 'పెషల్' విమానం ప్రెజంటుగా యిస్తున్నా తీసుకో....' అంటూ జేబులోంచి ఆడుకునే విమానం ఒకటి తీసి వాళ్ళ నానమ్మ చేతిలో పెట్టాడు.

"ఓరి తిక్క-న్నా! యిందులో ఎట్టారా వెళ్ళేదీ..." అంటూ పడీ పడీ నవ్వారు మా అత్తగారు.

"మరి టైం అయిందిరా...బయల్దేరదాం" అంటూ లేచారు మావారు, కారు దగ్గిరికి వెళ్ళడానికి.

"నేను రెడీ నాన్నా..." అంటూ మా వాడు వాళ్ళనాన్న వెనకాలే బయల్దేరాడు...

"అదేమిట్రా, పిల్లవాణ్ణిగూడా తీసుకెళ్తున్నావా జపానుకూ!" అన్నారు మా అత్తగారు ఆశ్చర్యంగా.

"అవున్నానమ్మా...నాన్నతో నేవెళ్తున్నా...మళ్ళీ రేపు నీ కోసం 'పెషల్' విమానం పంపుతాడుగా నాన్న!...అందులో తిరిగి వచ్చేస్తాలే. వెళ్లొస్తా నానమ్మా....టా-టా-చీరియో...." అంటూ వెళ్ళి కార్లో కూర్చున్నాడు, వాళ్ళ నానమ్మను ఏడిపిస్తూ.

"నిజమేనా ఏమిట్రా!" అంటూ ఖంగారు పడ్డారు మా అత్తగారు.

"అబ్బే! లేదమ్మా-నన్ను విమానం ఎక్కి-ంచి వాడొచ్చేస్తాడు-అందాకా తీసుకెళ్తున్నా-అంతే—"అంటూ మా వారు వెళ్లి కారో కూర్చున్నారు.

మా వారు జపాను వెళ్లిన వారంరోజుల తర్వాత ఒక రోజు రాత్రి మళ్ళీ మా అత్తగారికి కలొచ్చింది. ఆమెకు కాస్త దగ్గరో పడుకున్న

నేను వులిక్కిపడి లేచాను. నిద్దట్లో మా అత్తగారు పక పక నవ్వు తున్నారు. 'అత్తా అత్తా' అంటూ తట్టి లేపాను—చివాలున లేచి కండ్లు నులుపుకుంటూ నన్ను చూశారు. యీ సారి మా వాడు నిద్రలేవలా. మంచివేళ!

"ఏమి టత్తా, నవ్వుతున్నారు నిద్దట్లో! మళ్లీ ఏదైనా కలొచ్చిందా?" అని అడిగాను.

"ఆఁ. మళ్లీ ఆ జపానే కల్లో వచ్చింది—" అన్నారు మా అత్తగారు ఆవులిస్తూ.

"అయితే యీసారి కల్లో జపాను వెళ్లారన్నమాట—ఎట్లా వుందత్తా జపానూ!"

"ఆ—నా మొఖం! నేనెప్పుడైనా చూశాను గనకనా!—నే నిప్పుడు కల్లో చూసిన జపాను మన కావలిదగ్గిర చాకిచెర్ల లా వుంది. చిన్నవూరే! మనుషులు మాత్రం మనం ఆ మధ్య బెంగుళూరునుంచి తెచ్చిన జపాను బొమ్మల్లాగానే వున్నారు."

"మరి, ఎందు కట్లా పకపకా నవ్వారు?" అన్నాను.

"అదా—" అంటూ మళ్ళీ నవ్వడం మొదలెట్టారు. "ఆ జపాను వాళ్ళంతా గోచీపెట్టి చీర కట్టుకున్న నన్ను విచిత్రంగా చూట్టం మొద లెట్టారే—అందులో కొంద రాడవాండ్లూ, కుర్రకుంకలూ నా గోచీ పట్టి లాగి గోలచేయడం చూసి నవ్వొచ్చింది. ఏమిటో కల—నిజంగానే రేపు నేను జపాను వెళ్ళితే నా గోచీ చూసి అక్కడి వాళ్ళంతా నవ్వుతారో ఏం గోలో-" అన్నారు మా అత్తగారు.

"ఏం నవ్వర్లెండి....అక్కడి వాళ్ళంతా ఒంటినిండా ఒదులొదులుగా తగిలించుకునే లంబాడీ బట్టలు చూస్తే మనకు నవ్వొస్తుండ్లా" అన్నాను మా అత్తగారి గోచీని సమర్థిస్తూ.

"అవునే, అదేమిటే, ఆ జపాను బొమ్మల్లో వుండే ఆడవాళ్ళంతా నడ్డిమీద పరుపుచుట్టల్లాంటి వేవో తగిలించుకున్నారు!" అన్నారు మా అత్తగారు.

"ఆ పరుపుచుట్ట బహుశా వాళ్ళకు మీ గోచీలాంటిదై వుంటుందత్తా..." అన్నాను ఏం చెప్పాలో తెలీక.

"అంతే అంతే, అది వాళ్ళదేశపు గోచీ....అది సరేగానీ, అబ్బాయి విమానం ఎప్పుడు పంపుతాడే? ఇట్టా దిగి ఇట్టా పంపుతానన్నాడే! మరి నిన్నంతా రాలేదు విమానం." నా గుండె గతుక్కుమంది—తను సింగపూరువెళ్ళి జాబు వ్రాసిందాకా వాళ్ళమ్మకు నిజం చెప్పొద్దన్నారు మావారు, భయపడుతుం దని.

"పంపుతారు రేపో ఎల్లుండో...వర్షాకాలంగదూ, మధ్యమధ్య ఆగుతూ వస్తుంది విమానం..." అంటూ మెల్లిగా వెళ్ళి పడుకున్నాను.

"అట్లాగా! సరేలే. కానీ, తొందరేముందీ..." అంటూ మా అత్తగారు కూడా పడుకున్నారు. తెల్లవారింతర్వాత మావాడు మొదలెట్టాడు అల్లరి...

"నానమ్మకోసం నాన్న యింకా స్పెషల్ విమానం పంపలేదే" అంటూ.

"పంపుతాడులేరా...వర్షాకాలం గదూ! జోర్నా వర్షం కురుస్తూంటే మరి ఆకాశంలో విమానం తోలేవాడికి కండ్లు కనిపించొద్దూ! వర్షంవస్తే రోడ్లోవెళ్ళే కార్లే కనిపించవు...యింక మేఘాల్లో వెళ్ళే వాడికి దోవేం గనిపిస్తుంది!....వర్షాలు తగ్గాక పంపుతాడేమోలే...." అని మా అత్తగారంటూంటే "అయ్యొయ్యొ! నానమ్మ నిజంగానే నమ్మిందమ్మా..." అంటూ విరగబడి నవ్వాడు మావాడు....వాళ్ళ నానమ్మకు చెప్పొద్దని సౌంజ్ఞచేసి చెప్పాను మావాడికి...కాని వా డామాట అని నవ్వడం చూసి మా అత్తగారు పసికట్టేశారు.

"అదేమిటేవ్...అందరూ గలిసి నన్నాడించడం లేదు గదా!.," అబ్బాయి నిజంగానే విమానం పంపడా ఏం?..." నేను జవాబు చెప్పే లోగానే మళ్ళీ మా వాడు పొట్ట చెక్కలయ్యేట్లు నవ్వుతూ—

"విమానం పంపడం ఏమిటి నానమ్మా...రోజూ వస్తున్నాయిగా విమానాలు!... నాన్న ఎగతాళి కంటే నువ్వు నమ్మావే నానమ్మా!" అన్నాడు.

"అట్లాగా!... అయితే అదంతా ఎగతాళి కన్న మాటేనా!... ఓరి నీ యింట వాన గురవ...నే నింకా నిజమే ననుకున్నా, తిక్కముండని... అయితే రోజూ రైళ్ళు మాదిరిగానే విమానాలు జపాను వెళ్లి వస్తుంటా యన్నమాట."

"రోజూ వెళ్ళవులే...వారాని కోసారో రెండుసార్లో వెళతాయి. అదీ నేరుగా జపాను వెళ్ళడానికి లేదు—యిక్కణ్ణుంచి సింగపూర్ వెళ్ళాలి. ఆ తర్వాత 'బేంకాక్' వెళ్ళాలి. ఆ తర్వాత 'హాంకాంగ్' వెళ్ళాలి. ఆ తర్వాతనే 'జపాను' వెళ్లాలి...ఏమనుకున్నావ్ 'మైడియర్' నానమ్మా! జపా నంటే యిక్కడుందనుకున్నావా?" అంటూ మావాడు అమెరికన్ 'స్టయిల్లో' నవ్వాడు.

మా వాడు చెప్పిందంతా విన్న మా అత్తగారికి నోటమాట రాలేదు.

"ఎట్లాగూ! అయితే అది మనదేశంలో వున్న వూరు గాదన్న మాట....అవునుగాని, యిక్కడి కెంత దూరంరా జపానూ!"

"నియర్లీ త్రీ థౌజన్డ్ మైల్స్ నానమ్మా."

"ఇంగ్లీషులో చెప్తే నాకేం తెలుస్తుందిరా!"

"మరి నన్నేం చేయమంటావు నానమ్మా!—నీకు యింగ్లీషు ఎట్లాగో నాకు తెలుగట్లా...త్రీ థౌజన్ మైల్స్ అంటే మూడువేల మైళ్ళు గదమ్మా" అని న న్నడిగాడు మా వాడు.

"ఏమిటీ! మూడువేల మైళ్ళే!...ఓయ్ నాయనోయ్...అయితే యిప్పుడు మీ నాన్న అంతదూరం వెళ్ళాడన్న మాట..." అన్నారు మా అత్తగారు గుడ్లు తేలేసి.

"అవు న్నానమ్మా...రేపు నువ్వుగూడా వెళ్తావుగా, నాన్న పంపించే 'స్పెషల్' విమానంలో!..." అంటూ మా వాడు నవ్వాడు.

"ఆ...యింకా, నా తలకాయ, నేనేం వెడతా నంతదూరం...జపా నంటే ఏదో మనదేశంలో వూరే అనుకున్నా...నాకేం తెలుసూ, అది ఇంగ్లాండులాగా యింకో దేశం అనీ...యింతకూ ఆ జపాను పోవడానికి టిక్కెట్టు ఎంతరా?"

"కొన్ని వేల రూపాయ లవుతుంది."

"హోయ్ నాయనో! వేల రూపాయలే!...ఓసి మీ ఎగతాళి దొంగ ల్దోలా...మొగుడూ పెళ్లాం కలిసి ఎంత నాటకం ఆడారే!... యిప్పుడు నా మనవడు చెప్పకుండా వుంటే నాగతేమిటీంట!... జపాను ఢిల్లీ దగ్గరే నంటిరీ, టిక్కెట్టు నలభై రూపాయలే నంటిరీ!"

"ఓ....బ్యూటీ...బ్యూటీ...." అంటూ మా వాడు కుర్చీలోంచి కిందికి దూకి పడిపడీ నవ్వడం మొదలెట్టాడు.

ఉక్రోషం వచ్చిన మా అత్తగారు మనవడి వీపుమీద ముద్దుగా ఒక్క టిచ్చి..."దొంగభడవా! అప్పుడే చెప్పివుండకూడదూ?" ముగ్గురూ కలిసి ముసల్దాని చెవులకు తాటాకులు కడతారా!..." అన్నారు.

"నానమ్మా, నేనేం అబద్ధాలు చెప్పలా, నాన్నే నిన్ను ఏడిపించాడు."

"పోనీ, మీ అమ్మయినా నిజం చెప్పొచ్చుగా!...అసలు వా డింత దూరాభారం వెడతాడని తెలిస్తే వాణ్ణి వెళ్ళనిచ్చేదాన్నే కాదేంట!" అన్నారు మా అత్తగారు విచారపడుతూ... "ఆఁ, అందుకనే మీ అబ్బాయి మీతో

నిజం చెప్పలేదు. నన్ను చెప్పనివ్వలేదు...'' అని నేను అంటూండగానే 'పోస్ట్' అంటూ బయట్నుంచి కేకేశాడు పోస్టుమన్.

"నాన్న దగ్గిర్నుంచి లెటరొచ్చుంటుందమ్మా..." అంటూ పరుగు తీశాడు మావాడు. "అవునమ్మా...నాన్నదగ్గిర్నుంచే..." అంటూ మా వాడు సంతోషంతో ఎగురుకుంటూ వచ్చాడు. "చూశావా నానమ్మా..' జపానువాళ్ళ పోస్టుకవర్లు ఎట్లా వుంటాయో..." అంటూ ఒట్టి కవరు వాళ్ళ నానమ్మ కిచ్చి, లెటరు నా కిచ్చాడు...మా వారు క్షేమంగా జపాను చేరినట్లు వ్రాశారు టోకియోనుంచి...భయపడుతుందని వాళ్ళమ్మతో అబద్ధం చెప్పి నందుకు క్షమించ మని కోరారు వాళ్ళమ్మను...జపాన్నుంచి వచ్చేప్పుడు కొడుక్కు బొమ్మలూ, వాళ్ళమ్మకు 'కీ' యిస్తే వెళ్ళే విమానం తీసుకొస్తా నని వ్రాశారు...అది వింటూనే మావాడు వాళ్ళ నానమ్మను గోలచేయడం మొదలెట్టాడు..."భలే భలే! నానమ్మా...నువ్వు జపాన్ వెళ్ళకపోయినా నాన్న నీకు జపాన్‌నుంచి స్పెషల్ విమానం కొనుక్కొస్తున్నాడు...' అంటూ చప్పటు కొట్టాడు.

"వూరుకోరా తిక్కన్నా...పిల్లవాడి క్షేమం తెలిసింది. నా కంతే చాలు...నాకే విమ్లానం అక్కర్లేదు. మీ నాన్న తిరిగి చల్లగా యిల్లు జేరితే నేను విమానం ఎక్కి జపానుయాత్ర వెళ్ళినంత పుణ్యం...'' అంటూ కొడుకు క్షేమంగా తిరిగిరావా లని తిరుపతి వెంకన్నకు వెంటనే ఒక ముడుపు గట్టేశారు మా అత్తగారు.